# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా

సోమవారం,20 జనవరి 2025 | 8 పేజీలు


## లద్దాఖ్ నుంచి విశాఖపట్నం పరీక్షకేంద్రం మార్పు

**- కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మకి కృతజ్ఞతలు తెలిపిన తిరుమల విద్యాసంస్థలు**



**భీమవరం,మేజర్‌న్యూస్:** తిరుమల విద్యాసంస్థల విద్యార్థులకు జేఈఈ మెయిన్స్ సెషన్-1 పరీక్ష కేంద్రాల కేటాయింపులో చోటుచేసుకున్న తప్పిదం సరిచేసినందుకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకి సంస్థ యాజమాన్యం, విద్యార్థులు,తల్లిదండ్రులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వివరాల్లోకి వెళితే, జేఈఈ మెయిన్స్ పేపర్-1 (బీటెక్)కోసం సంస్థకుచెందినఇద్దరు విద్యార్థులకు లద్దాఖ్‌లోని కార్గిల్‌ను పరీక్ష కేంద్రంగా కేటాయించగా,? రోజు పేపర్-2 (బీఆర్క్) కోసం విశాఖపట్నం కేంద్రాన్ని కేటాయించారు. ఒకే సమయంలో 3000 కిలోమీటర్ల దూరం ప్రయాణించి పరీక్షలు రాయడం అసాధ్యమని బాధిత విద్యార్థులు,వారి తల్లిదండ్రులు సంస్థ రెసిడెంట్ డైరెక్టర్స్ ఎస్.సాయిరాజు,శ్రీనివాస వర్మను కలిసి కేంద్ర మంత్రిని ఆశ్రయించారు. తప్పిదాన్ని గ్రహించిన భూపతిరాజు శ్రీనివాసవర్మ ఈ విషయాన్ని కేంద్ర విద్యాశాఖ

- తరువాయి 2లో..

## వేగవంతంగా
# అభివృద్ధి - సంక్షేమ పథకాలు అమలు

**- 5చిన్నలంక గ్రామాల్లో రూ.1 కోటి 50 లక్షలతో పనులకు శ్రీకారం**
**- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు**



**యలమంచిలి,మేజర్‌న్యూస్:** గత ప్రభుత్వంలో కుంటుపడిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎన్డీఏ ప్రభుత్వంలో రైలు పట్టాలెక్కించి వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.

ఆదివారం మండలంలో చింతదిబ్బ, ఇలపకుర్రు, అబ్బిరాజుపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలి లంక గ్రామాల్లో రూ. 1కోటి 50లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి రామానాయుడు శ్రీకారం చుట్టారు.మంత్రి రామానాయుడు స్వయంగా మోటరు సైకిల్ నడుపుతూ ప్రజలకు అభివాదాలు చేసు కుంటూ,యోగక్షేమాలనుఅడిగి తెలుసుకుంటూ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.డాక్టరు బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, మంత్రి అంజలి ఘటించారు. గ్రామాలలో ప్రజలు అడుగడుగునా మంత్రికి ఘనస్వాగతం పలికారు. మంగళ హారతులను ఇచ్చి నుదుటన కుంకుమ తిలకందిద్ది మంత్రి రామానాయుడుకి మహిళలు ఘనస్వాగతం పలికారు.ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంధ్రుల హక్కువిశాఖ ఉక్కు ప్లాంటును గత ప్రభుత్వంలో ప్రైవేటీకరణ పరమైతే, నేడు ప్రజా ప్రభుత్వంలో ప్రైవేటుపరం కాకుండాకాపాడిన ఘనత చంద్రబాబుది అని అన్నారు.విశాఖఉక్కు ప్రైవేటీకరణ జరగకుండా ఆనాడు వాజపాయ్ హయాంలో రూ 4500 కోట్లు, నేడు నరేంద్రమోడీ ద్వారా రూ13 వేల కోట్లు నిధులు తెచ్చిచంద్రబాబు కాపాడారని అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీని దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతోనే స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి శ్రీకారంచుట్టి

- తరువాయి 2లో..

## ప్రభుత్వ ఆసుపత్రిని
# సందర్శించిన జిల్లా కలెక్టర్

**- ర్యాంపు, డ్రైయినేజీ,అత్యవసర పనుల ప్రతిపాదనలు సమర్పించండి**





**ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేపట్టవలసిన అత్యవసర పనుల అంచనాల ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆదివారం స్థానిక సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి సందర్శించారు.

ఈసందర్భంగా మాతా శిశు సంరక్షణ భవనం ప్రవేశ మార్గం వద్ద వీల్ చైర్స్ సుళువుగా వెళ్లేందుకు ర్యాంపు ఏర్పాటుకు, ఆసుపత్రి చుట్టూ ఉన్న డ్రైయిన్ల ద్వారా మురుగునీటి పారుదల సక్రమంగా జరిగేందుకు అవసరమైన డ్రైయినేజీ వ్యవస్థ మెరుగుపర్చేందుకు అవసరమైన అంచనాలతో కూడిన ప్రతిపాధనలను వెంటనే సిద్ధం చేయాలన్నారు. నగరపాలకసంస్థ ఇంజనీరింగ్, ఆసుపత్రుల ఇంజనీరింగ్‌విభాగంఇంజనీర్లు సమన్వయం చేసుకొని సంబంధిత ప్రతిపాధనలు సిద్ధం చేయాలన్నారు. తొలిగా అత్యవసర పనుల ప్రాతిపధికగా విడి విడిగా అంచనాల ప్రతిపాధనలురూపొందించాలని సూచించారు. కలెక్టర్ వెంటఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎంఎం రాజు, ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, నగరపాలక సంస్థఇఇ జి.సురేంధ్రబాబు, తహాశీల్దారు జివి శేషగిరి తదితరులు ఉన్నారు.

## అంగన్వాడి పిల్లల నమోదుకు
# ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులు

**- సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపు**



**భీమవరం,మేజర్‌న్యూస్:** జిల్లాలోని అన్ని అంగన్వాడి కేంద్రములలో నమోదు కాబడిన 0-6 సంవత్సరముల పిల్లలకు కొత్త ఆధార్ కార్డు నమోదు చేయుటకు ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జనవరి 21 నుండి జనవరి .24 వరకు మరియు జనవరి 27 నుండి జనవరి 30వరకు అంగన్వాడి కేంద్రములలో 06 సంవత్సరముల పిల్లల కొరకు క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని మొత్తం 90 ఆధార్ కేంద్రాలలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసి జిల్లాలోని ఆధార్ కార్డులేని పిల్లలు ఉన్న అన్ని అంగన్వాడి కేంద్రములలో షెడ్యూల్ ప్రకారం ఆధార్ క్యాంపులు నిర్వహించాలన్నారు. అంగన్వాడి వర్కర్లు ఐసిడిఎస్ సూపర్వైజర్లు,సిడిపిఓలు అంగన్వాడి కేంద్రములోని పిల్లల తల్లితండ్రులకు తెలియజేసి అవసరమైన ధృవ పత్రాలతో ప్రత్యేక ఆధార్ క్యాంపులో కొత్త ఆధార్ కార్డులకు నమోదు చేసుకోనేలా ప్రోత్సహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ఆధార్ కార్డులు లేని పిల్లలందరికీ నూరు శాతం కొత్త ఆధార్ కార్డుల నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ

- తరువాయి 2లో..

## కిడ్నాప్ కేసులో 7 గురిని
# అరెస్ట్ చేసిన పోలీసులు





**భీమవరం,మేజర్‌న్యూస్:** పశ్చిమగోదావరి జిల్లా భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ వద్ద ఈ నెల 16న జరిగిన కిడ్నాప్ కేసును పోలీసులు ఛేధించారు. ఆదివారం టూటౌన్ పోలీస్ స్టేషన్లో డిఎస్పీ జయ సూర్య తెలిపిన వివరాల ప్రకారం 52 ఏళ్ల విశ్వనాథం సత్యనారాయణను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేయగా, ఆయన కుమారుడు సాయినాథ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ ఘటన వెనుక ఉన్న కుట్రను చేదించామని తెలిపారు.

**-కిడ్నాప్ వెనుకఆర్థికసమస్యలు-** విశ్వనాథం సత్యనారాయణ తక్కువ వడ్డీకి ప్రజల నుంచి డబ్బులు తీసుకుని కమిషన్ వ్యాపారం, ఫ్యాన్స్ బిజినెస్ నిర్వహిస్తూ కోవిడ్ సమయంలో అనేక కోట్ల రూపాయలు బాకీ పెడుతూ వచ్చింది. ముఖ్యంగా, సోమిశెట్టి సత్య ప్రసాద్,లక్ష్మీ వెంకట మల్లికార్జున సురేష్ దగ్గర 10 కోట్ల రూపాయలు తీసుకుని వడ్డీ కూడా చెల్లించకపోవడంతో,ఈవ్యవహారాన్ని అనంత పురంలోని తన స్నేహితులు ఆశీస్, లోకేష్ వద్దకు తీసుకెళ్లారు. 10శాతం కమిషన్ డీల్‌తో మొత్తం 12 మంది కుట్రలో పాల్గొన్నారు.

**కిడ్నాప్‌చేసినవిధానం -** ఈ గ్యాంగ్

- తరువాయి 2లో..

# కలక్టరేట్‌లో యోగి వేమన జయంతి వేడుకలు

## – జెసి చిన్న రాముడు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జీవిత సత్యాలను పద్యాల రూపంలో అందించిన మహోన్నత వ్యక్తి యోగి వేమన అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు పేర్కొన్నారు. స్థానిక కలక్టరేట్‌లో ఆదివారం ఉదయం యోగి వేమన జయంతి వేడుకలు సందర్భంగా యోగి వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెసి ఎస్. చిన్న రాముడు మాట్లాడుతూ, యోగి వేమన జయంతి శుభాకాంక్షలు తెలియ చేశారు. వేమన ఎన్నో భోగ భాగ్యాలు అనుభవించి, అవి ఏవీ జీవిత సత్యాలు కాదని తన రచనలు ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తిత్వం కలిగిన వారన్నారు. తన రచనలు ద్వారా గొప్ప తెలుగు తత్వవేత్త మరియు కవిగాను, ఆయన కవితలు తెలుగులో సరళమైన భాష మరియు స్థానిక యాసలను ఉపయోగించడం ద్వారా ప్రతి ఒక్కరికీ దగ్గర అయ్యాయన్నారు. ఉప్పు కర్పూరం ఒక్కలా ఉన్నా రుచులు వేరని ఉప్పకప్పురంభు పద్యం ద్వారా, మనుషులందు పుణ్య పురుషులు 6వేరయా అంటూ మానవుల్లో స్వభావరీత్యా కలిగిన వ్యత్యాసాన్ని తన రచనలు ద్వారా చాటి చెప్పడం జరిగిందన్నారు. వేమన పద్యాలు తెలియని తెలుగువారు ఉండరనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. ఆయన రచనలు ద్వారా జీవితా సత్యాలను తెలుసుకుని భావితరాలకు అందించే ప్రయత్నం ప్రతి ఒక్కరు చెయ్యాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి టి సీతారామ మూర్తి, జిల్లా బిసి సంక్షేమ అధికారి బి శశాంక, కలక్టరేట్ ఎవో ఎండీ ఆలీ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆపన్న హస్తం

## – కష్టంలో ఉన్న కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సహాయం

**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** మనం సంతోషంలో ఉన్నప్పుడు అందరూ వస్తారు.. అదే కష్టంలో ఉంటే.. ఐనవారు కూడా పరాయివాళ్ళు అయ్యే కాలం ఇది.. ఇది జగమెరిగిన సత్యం. కానీ మన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాత్రం ఎవరికి కష్టమొచ్చినా.. బాధ వచ్చిన మీకు నేనున్నా అంటూ ఆపన్న హస్తం అందిస్తూ ఆర్థిక సహాయం చేయటంతోపాటు ఆ కుటుంబాలకు ధైర్యం చెబుతూ ఓదార్పు, పరామర్శలు చేస్తూ తన మానవత్వం చాటుకుంటున్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన రామచంద్రపురం నియోజవర్గం ప్రజల రుణం తీర్చుకునే దిశగా నిత్యం తపన పడుతున్నారు. మంత్రి సుభాష్ దాతృత్వం, ఔదార్యం, దయాగుణం కోసం ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గత 20 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తనకు తోచిన సహాయం అందిస్తూనే ఉన్నారు. రామచంద్రపురం నియోజవర్గం ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ముందుకు సాగిపోతున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం వెల్ల గ్రామంలో ఇటీవల అకాల మృతి చెందిన యార్లగడ్డ శ్రీను కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు రూ. 25 వేలు ఆర్థిక సహాయం అందించి, ఆ కుటుంబాన్ని ఓదార్చి, ధైర్యం చెప్పారు. అదే గ్రామంలో ఇటీవల స్వర్గస్తులైన కోనప రెడ్డి వరలక్ష్మి, తుమ్మరపల్లి మంగలక్ష్మి కుటుంబాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్.. కూటమి నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులతో కలిసి పరామర్శించి ఓదార్పు చెప్పారు. తన దైనందిన బిజీ కార్యక్రమాలు ఉన్నప్పటికీ తన సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తూ.. ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆపదలో, కష్ట కాలంలో ఉన్న కుటుంబాలు స్వాంతన పొందే విధంగా ఆర్థికంగా సహాయం చేస్తూ వారి కుటుంబాలకు కొండంత అండగా నిలబడుతున్నారు. మంచి మనసు, మానవత్వం ఉన్న నాయకుడు మా నియోజకవర్గానికి మంత్రిగా ఉండటం మా అదృష్టమంటూ పలువురు రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు మంత్రి సుభాష్ సేవలను అభినందించారు.

# పారిశుధ్య కార్మికులకు రేషన్ కిట్స్ పంపిణీ

రంపచోడవరం,మేజర్‌న్యూస్: నారాయణసేవలో భాగంగా సిరిగిందలపాడులోని శ్రీ రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాలలో రంపచోడవరం గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు రేషన్ కిట్లు పంపిణీ చేశారు. స్వామి వివేకానంద 163వ జయంతి ఉత్సవం కార్యక్రమంలో భాగంగా ఆదివారం రంపచోడవరం గ్రామ పంచాయతీ లో పనిచేసే 17మంది పారిశుధ్య కార్మికులకు రేషన్ కిట్స్ వితరణ జరిగింది. ఒక్కొక్క రేషన్ కిట్‌లో 9రకాల వంట సరుకులు కందిపప్పు కిలో, మినపప్పు కిలో, పంచదార కిలో, గోధుమ పిండి కిలో, వేరుశెనగ గుళ్ళు కిలో, ఇడ్లీ రవ్వ కిలో, కరాచీ రవ్వ కిలో, వంటనూనె కిలో, టీ పౌడర్ 100 గ్రాములు అందజేసారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు అన్నదానం చేశారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ దాసరి ఉమా మహేష్, గ్రామ పంచాయతీ శానిటేషన్ సెక్రటరీ బి. స్. వి. వి సత్య నారాయణ రెడ్డి, రామకృష్ణ మిషన్ మెడికల్ క్యాంప్ కో ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్స్ సూర్య, దాసరి పెద్ద అప్పారావు పాల్గొన్నారు.

# అంగన్వాడి పిల్లల నమోదుకు ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులు

మొదటిపేజి తరువాయి

మండలాల్లో ఆచంట –2,ఆకివీడు– 4, అత్తిలి–3, భీమవరం–6, యలమంచిలి–4, గణపవరం–5, ఇరగవరం–3,కాళ్ళ–4,మొగల్తూరు–4, నరసాపురం–3,పాలకొల్లు–3,పాలకోడేరు–3,పెనుగొండ–3, పెనుమంత్ర–3 పోడూరు–4, తాడేపల్లిగూడెం –3, తణుకు–6, ఉండి–3, వీరవాసరం–4 ఆధార్ కేంద్రాలను, అర్బన్ మండలాల్లో భీమవరం–4, నరసాపురం–4, పాలకొల్లు–3, తాడేపల్లిగూడెం–3, తణుకు–6 ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

# 'ఐటీడీఏ' పాలకవర్గం బైలా మార్పు చేయాలి

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పాడేరు జిల్లా కలెక్టర్ ను రంపచోడవరం ఐటీడీఏ పాలకవర్గం చైర్మన్ గా, జిల్లా అధికారులను సభ్యులుగా మార్పు చేసి వెంటనే రంపచోడవరం, చింతూరు ఐటిడిఏ పాలకవర్గ సమావేశాలు నిర్వహించేందుకు ఆదేశాలు ఇవ్వాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రికి ఒక లేఖ వ్రాసినట్లు ఆయన తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లకు ఆయా జిల్లా కలెక్టర్లు చైర్మన్లుగా, జిల్లా అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. గవర్నర్ బాడీ సమావేశం నిర్వహణకు 1976 వ సంవత్సరం నుండి సొసైటీగా రిజిస్టరు అయ్యారని ఆయన పేర్కొన్నారు. కాగా రంపచోడవరం, చింతూరు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ చైర్మన్ గా, జిల్లా అధికారులు సభ్యులుగా ఉన్నారని, అయితే 2022వ సంవత్సరంలో రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటు అయినప్పటి నుండి రంపచోడవరం, చింతూరు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలను పాడేరు జిల్లాలో కలిపారన్నారు. అందువల్ల రంపచోడవరం, చింతూరు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలకు పాడేరు జిల్లా కలెక్టర్‌ను చైర్మన్‌గా, జిల్లా అధికారులను సభ్యులుగా గవర్నమెంట్ బాడీ సమావేశమునకు బైలా మార్పు చేయాల్సి ఉందన్నారు. రంపచోడవరం సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ఐటీడీఏ గవర్నమెంట్ బాడీ సమావేశం 2021 డిసెంబర్లో జరిగిందని, కానీ ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఈ సమావేశం జరగాల్సి ఉందన్నారు.

పాడేరు జిల్లా కలెక్టర్‌ను ఐటీడీఏ చైర్మన్‌గా, జిల్లా అధికారులను సభ్యులుగా మార్పు చేసి వెంటనే రంపచోడవరం, చింతూరు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థల గవర్నమెంట్ బాడీ సమావేశాలు జరిగేటట్లు ఆదేశాలు ఇప్పించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# లద్దాఖ్ నుంచి విశాఖపట్నం పరీక్షకేంద్రం మార్పు

మొదటిపేజి తరువాయి

మంత్రికి తెలియజేసి ఎన్‌టిఎ అధికారులు చేసిన పొరపాటును సరిదిద్దేలా చర్యలు చేపట్టారు. విద్యార్థుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని పరీక్ష కేంద్రాలు సవరిచేయడంలో ప్రత్యేక చొరవ తీసుకున్న కేంద్ర మంత్రికి విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# వేగవంతంగా అభివృద్ధి - సంక్షేమ పథకాలు అమలు

మొదటిపేజి తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం ఘనంగా జరుగుతున్నాయన్నారు. ఆరు నెలలు పాలనలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తోడుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉన్నారని వీరికి తోడుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహాయ సహకారాలతో రాష్ట్రం అన్ని రంగాలలో ముందుకు సాగుతుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు గ్రంథి నాగవెంకట పవన్ కుమార్,యంపిడివో కార్యాలయం ఏవో జి.శ్రీనివాస రావు,పంచాయతీ రాజ్ సహాయక ఇంజనీరు వై.వి.ఆర్. నాగేశ్వర రావు, వివిధ శాఖల అధికారులు,గ్రామ సర్పంచులు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నాప్ కేసులో 7 గురిని అరెస్ట్ చేసిన పోలీసులు

మొదటిపేజి తరువాయి

రెండు రోజులపాటు విశ్వనాథం ఇంటి చుట్టూ గమనించి, 16న రైల్వే స్టేషన్ వద్ద బంధువులను డ్రాప్ చేస్తుండగా, సఫారీ డ్రెస్ ధరించి వాకీటాకీలతో పోలీసులమని చెప్పి కిడ్నాప్ చేశారు. మొదట విశ్వనాథం కారు మార్గమధ్యంలో వదిలిపెట్టి, అనంతరం ఇన్నోవా కారులో అనంతపురానికి తీసుకెళ్లి 10 కోట్లు ఇవ్వాలని బెదిరించారు. సత్యనారాయణ తన భీమవరంలోని ఆస్తులను అమ్మి డబ్బులు చెల్లిస్తానని చెప్పడంతో, భీమవరానికి తిరిగి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో పోలీసులు వారిని పట్టుకున్నారు.

**– పోలీసుల స్పందన –** పోలీసులు తక్షణం స్పందించి 7గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి చాకు, క్రికెట్ స్టిక్స్, ఆర్టిస్ట్, డైరీ, 9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఐదుగురిని త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ కేసును ఛేదించిన భీమవరం టూ టౌన్ సీఐ, సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీసు సిబ్బందిని డీఎస్పీ జయ సూర్య అభినందించారు. భీమవరంలోఈ ఘటన పోలీసుల చురుకైన చర్యకు ఉదాహరణగా నిలిచింది.

# రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



**ఏలూరు మేజర్‌న్యూస్ :** ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో, పవర్ పేట రైల్వే స్టేషన్ సమీపంలో చిట్టివలస పాకలు వద్ద, గుర్తు తెలియని సుమారు 50–55 సం.ల వయస్సు కలిగిన పురుషుడు గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుని ఎత్తు సుమారుగా 5.6, నలుపు, తెలుపు జుట్టు, మాసిన గెడ్డం,సామాన్య దేహాధారుడ్యము. మృతుడు లేత ఆకుపచ్చ రంగు పొడవు చేతుల చొక్కా, ముక్కు పొడుం రంగు డ్రాయర్ కలిగి ఉన్నాడు. మృతుని తాలూకా ఎవరూ లేని కారణముగా మృత దేహమును ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని శవాగారము నందు భద్రపరచటమైనదని ఏలూరు రైల్వే ఎస్ ఐ పి . సైమన్ తెలిపారు. వివరాలు తెలిస్తే ఈ నెంబర్ కు ఫోన్ చేయవచ్చని 9989219559, కేసు కట్టి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

# నేడు భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



**భీమడోలు,మేజర్‌న్యూస్:** భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 20వ తేదీన మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మావతి దేవి తెలిపారు. సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షులు కె.రామయ్య(ఆదాం)అధ్యక్షత వహిస్తారన్నారు. సమావేశానికి హాజరుకాని మండల అధికారులపై తగు చర్యలు తీసుకొనే నిమిత్తం జిల్లా స్థాయి అధికారులకు సమావేశం సిఫార్సు చేస్తుందన్నారు. ఇదే క్రమంలో సమావేశానికి హాజరయ్యే మండల స్థాయి అధికారులు తమ శాఖల ఆధ్వర్యంలో ఇటీవల కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తిస్థాయి వివరాలతో కూడిన నివేదికను సమావేశానికి ముందు సమర్పించాలని కోరారు.

– ఆధార్ మొబైల్ క్యాంపులు – మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఆయా గ్రామాల పరిధిలో గల అంగన్వాడీ కేంద్రాలు వేదికగా క్యాంపులను నిర్వహిస్తామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తెలిపారు. ఈ విషయమై విస్తృతస్థాయి ప్రచారం చేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. క్యాంపు నిర్వహణలో భాగంగా గుండుగొలను క్యాంప్ యూనిట్ ఆధ్వర్యంలో 21 ,22వ తేదీలలో ఆగడాల లంక, 23 ,24వ తేదీలలో చెట్టున్న పాడు గ్రామాలలో క్యాంపులు ఉంటాయన్నారు. ఇదేవిధంగా పూళ్ళ క్యాంప్ యూనిట్ ఆధ్వర్యంలో ఈనెల 21 ,22వ తేదీలలో పూళ్ళ,, 23 ,24వ తేదీలలో కురెళ్ళ గూడెం గ్రామాలలో క్యాంపులు ఉంటాయన్నారు.

భీమడోలు క్యాంప్ యూనిట్ ఆధ్వర్యంలో ఈనెల 21 ,22వ తేదీలలో భీమడోలు ,23 ,24వ తేదీలలో సూరప్పగూడెం గ్రామాలలో క్యాంపులను నిర్వహిస్తామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తెలిపారు. క్యాంపులలో ఆధార్ కార్డుల నమోదు, కార్డుల్లో నవీకరణ కార్యక్రమాలను చేపడుతామని, ఈఅవకాశాన్ని వినియోగించు కోవాలని ప్రజలకు మండల పరిషత్ అభ్యర్థి అభివృద్ధి అధికారి విజ్ఞప్తి చేశారు.

# ద్విచక్ర వాహనాల దారులు హెల్మెట్ వినియోగం తప్పనిసరి







**భీమవరం,మేజర్ న్యూస్:** 36వ జాతీయ భద్రత మాసోత్సవం సందర్భంగా ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ వినియోగం తప్పనిసరి అని పశ్చిమ గోదావరిజిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయ రవాణా తనిఖీ అధికారులు అన్నారు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా ఆదివారం భీమవరంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని రవాణా శాఖ అధికారులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భీమవరం రవాణా కార్యాలయానికి చెందిన పలువురు రవాణా తనిఖీ అధికారులు పాల్గొని వాహనదారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. నాలుగు చక్రాల వాహన డ్రైవరు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని వాహనాలకు ఇన్సూరెన్స్ పొల్యూషన్ రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని వారు సూచించారు.

వాహనాలు నడిపే సమయాలలో సెల్ఫోన్ మాట్లాడి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వారితో వారి అనుభవాన్ని కూడా అందరికీ తెలియజేశారు. సిఎంవి రూల్ 104 ప్రకారం వాహనం ముందు,వెనుక భాగాల్లో రేడియం స్టిక్కర్స్ లేని వాహనాలకు అంటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రవాణా తనిఖీ అధికారులు కే. ప్రసాద్, ఎం రవికుమార్, ఎన్ ఎల్ ఎస్ లక్ష్మి,ఏఎస్‌పి తేజ,సిబ్బంది పాల్గొన్నారు.



# వైసిపి నేత గుడాల గోపి పరామర్శ

**పోడూరు,మేజర్ న్యూస్:** మండలంలో వేడంగి గ్రామం విశ్వామానవవేదిక అధ్యక్షులు మల్లుల సురేష్ మాతృమూర్తి మరణించారు, విషయం తెలుసుకోని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి పాలకొల్లు వైసీపీ నియోజకవర్గం ఇంచార్జి గుడాల శ్రీహరి గోపాలరావు గోపి పరామర్శించారు, పరామర్శించిన వారిలో మాజీ డీసీఎంఎస్ చెర్మన్ యడ్ల తాతజీ బాబు, జోగాడా ఉమామహేశ్వరావు ,విశ్వమానవ వేదిక అధ్యక్షులు మల్లుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు ప్రజల హృదయాలలో ఎన్‌టిఆర్‌కు సుస్థిర స్థానం



**కలిదిండి,మేజర్ న్యూస్ :** రాజకీయాలలో కొత్త నిర్వచనం తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. కలిదిండి మండలం మట్టగుంట గ్రామంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి సందర్భంగా కూటమి నాయకులతో కలిసి ఎన్‌టిఆర్ చిత్రపటనికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులకు వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగంలో తన నటనతో తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించి తెలుగు దేశం పార్టీని స్థాపించి" కుదు గూడు నీడ "నినాదంతో అధికారంలోకి వచ్చి కరణం మునసబు వ్యవస్థలను పటేల్ పట్వారి వ్యవస్థలను రద్దుచేసి తెలుగు ప్రజలకు ఆరాధ్యుడైనడని తెలిపారు. అలాగే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించి ఎందరో బీసీ నేతలను రాజకీయంగా ఉన్నత స్థానంలో నిలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ వైస్ చైర్మన్ నాగిడి వీరబ్రహ్మం,మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బళ్లా రాజు, కూటమి నాయకులు అంద్రాజు దుర్గారావు, తిరుమాని పాండురంగారావు, నల్లమోతు వెంకటేశ్వరరావు, రేవుగణపతి, కోకాతాతయ్య, కోపనాతి వెంకటేశ్వరరావు, మోకా రామకృష్ణ,తిరుమల శెట్టిశ్వర పరశురాముడు, కొల్లాటి గోకనేశ్వరరావు, పెదసింగుచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## నత్త నడకన రోడ్డు పనులు : సిపిఐ ఆందోళన






**కుక్కునూరు,మేజర్‌న్యూస్ :** మండలంలో చేపట్టిన ప్రధాన రహదారి సా..గుతున్న పనులపై సీపీఐ కుక్కునూరు సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళనకు దిగారు. రోడ్డు అధ్వాన్నంగా తయారై తరుచూ ప్రమాదాల చోటుచేసుకుంటున్న రోడ్డు నిర్మాణపై సీపీఐ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండలంలోని పెదరావిగూడెం ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ గత 3నెలల క్రితం రహదారి నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయకుండా గాలికివదివేశారని ఆరోపించారు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు రోడ్డుపై వాహనాలు వెళ్తుంటే వచ్చే దుమ్ము ధూళితో పలువురు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. కాగా రోడ్డు పక్కన ఉన్న పంటపొలాలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. రహదారిపై కంకర పైకి లేచి వాహనదారుల పై పడి ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. తక్షణమే కాంట్రాక్టర్ , అధికారులు దృష్టి పెట్టి రోడ్డు పనులు పూర్తి చేసి,ప్రమాదాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని వెంకటాచారి డిమాండ్ చేశారు. ఆందోళనలో మండల కార్యవర్గ సభ్యులు మడిపల్లి. రమణయ్య, జిల్లా సమితి సభ్యులు కూరాకుల బాబూరావు, పళ్ళాల భిక్షం, సోడే నాగేష్, మారయ్య, కనిత రాము, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

# యోగివేమన రచనలు ఇప్పటికి అచరణీయం



**భీమడోలు,మేజర్‌న్యూస్:** మహాకవి, సంఘసంస్కర్త యోగివేమన రచనల సారాంశం నేటికీ ఆచరణీయమని భీమడోలుకు చెందిన సామాజిక కార్యకర్త మండే సుధాకర్ అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయ పాలకులు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రంథాలయంలో యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సామాజిక కార్యకర్త సుధాకర్ మాట్లాడుతూ,చిన్న చిన్న తెలుగు పదాలను వాడుతూ అందరికీ అర్థమయ్యే రీతిలో రచనలు చేసి సామాన్యుల మన్ననలను సైతం సొంతం చేసుకున్న యోగివేమన ను ధన్యజీవి గా అభివర్ణించారు. అనంతరం గ్రంథాలయంలో విద్యార్థులలో పఠనాసక్తిని పెంచే క్రమంలో గ్రంథాలయ సంస్థ ఏర్పాటుచేసిన చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు తాము చదివిన పుస్తకాలపై వ్రాసిన సమీక్షలను సామాజిక కార్యకర్త పరిశీలించారు. కొన్ని సవరణలను విద్యార్థులకు సూచించారు. ఇదే కార్యక్రమం కొనసాగితే విద్యార్థులు రానున్న కాలంలో ఉత్తమ పాఠకులుగా తయారయ్యే అవకాశం ఉందని తెలిపారు.

# క్రీడలు మానసిక ఉల్లాసం,శారీరక దృఢత్వానికి దోహదం







**– కొత్తపల్లి సోదరులు యువతకు ఆదర్శం : జిల్లా కలెక్టర్ నాగరాణి**

**నరసాపురం,మేజర్ న్యూస్ :** రుస్తుంబాదలో శ్రీ గోగులమ్మ తల్లి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొత్తపల్లి సోదరుల సారథ్యంలో 5 రోజులు పాటు జరిగిన జాతీయ స్థాయి స్త్రీ,పురుషుల కబాడీ పోటీలు శనివారం అర్ధరాత్రి ముగిశాయి. ఈ కబాడీ పోటీల ముగింపు కార్యక్రమమునకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్ పి అద్నాన్ నయీం అస్మి ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. ఆహ్లాదముగా క్రీడలను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమయంలో యువత చెడు అలవాట్లకు మరలకుండా గత 30 సంవత్సరములగా శ్రీ గోగులమ్మ తల్లి ఉత్సవ కమిటీ, కొత్తపల్లి సోదరులు సారథ్యంలో దేశంలో పలు రాష్ట్రంల నుండి క్రీడాకారులను తీసుకువచ్చి సాంప్రదాయ గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తూ జాతీయస్థాయి స్త్రీ, పురుషుల కబాడీ పోటీలు నిర్వహించడం గర్వకారణం అన్నారు. కొత్తపల్లి సోదరులను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆమె అన్నారు. కబాడీ గ్రామీణ క్రీడ గా అందరికీ హృదయానికి దగ్గరైన ఆట అన్నారు. చిన్నతనంలో ఎంతో ఇష్టముగా ఆడేవారుమని చెప్పారు.

అమ్మాయిలు, అబ్బాయిలు కూర్చుని చక్కగా క్రీడలను వీక్షించడం చాలా సంతోషం అనిపించిందన్నారు. నేనైతే చాలా బాగా ఎంజాయ్ చేశాను అన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా యువత మెరుగైన అవకాశాలని అందిపుచ్చుకోవచ్చు అన్నారు.గ్రామీణ క్రీడలు అంతరించి పోకుండా ఇటువంటి కమిటీలు చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమన్నారు. యువతకు క్రీడలపై మక్కువ పెంచడం ద్వారా చెడువ్యసనాలకు దూరం చేయవచ్చు అన్నారు. మాజీ మంత్రి రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు దూర ప్రాంతాల నుండి అనేకమంది ఇక్కడకు వస్తూ ఉంటారు వారందరికీ ఆహ్లాదకరంగా ఉండేందుకు శ్రీ గోగులమ్మ తల్లి ఉత్సవ కమిటీ నిర్వహిస్తున్న కబాడీ పోటీలు ఆనందాన్ని కలిగిస్తున్నాయన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలుతో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు అని అన్నారు. అనంతరం స్త్రీ,పురుషుల జాతీయస్థాయి కబాడీ పోటీల్లో గెలుపొందిన పురుషుల విభాగంలో మహారాష్ట్ర ప్రథమ స్థానం, కొలకత్తా ద్వితీయ స్థానం, సిఆర్‌పిఎఫ్ ఢిల్లీ తృతీయ స్థానం, కోలకత్తా పోలీస్ నాలుగో స్థానం గెలిచాయి, మహిళా విభాగంలో సిఆర్‌పిఎఫ్ ఢిల్లీ మొదటి స్థానం, రాజస్థాన్ రెండో స్థానం, కోలకత్తా కేరళ జట్లు మూడు,నాలుగు స్థానాల్లో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఆయా జట్లకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్ పి అద్నాన్ నయీం అస్మి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమములో ఆర్డీవో దాసిరాజు,డీఎస్పీ డా.డి శ్రీ వేద,తాహసిల్దార్ టి.రాజరాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి భుజంగ రాయుడు, శ్రీ గోగులమ్మ ఉత్సవకమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# భీమవరం అభివృద్ధి పనుల డిజైన్లు త్వరితగతిన పూర్తి చేయాలి

**– జేసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశం**



**భీమవరం,మేజర్ న్యూస్:** జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద, ఆర్టీసీ డిపో వద్ద బస్‌స్టాప్‌ల నిర్మాణాలకు స్థలాలను ఆదివారం పరిశీలించారు. వీటికి సంబంధించిన డిజైన్లను రూపొందించి రానున్న రెండు రోజుల్లో అందజేయాలని మున్సిపల్ సర్వేయర్లను ఆదేశించారు. ఎస్ఆర్‌కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా బస్టాప్ నిర్మాణ వ్యయాన్ని భీమవరం హాస్పిటల్స్ యాజమాన్యం, ఆర్టీసీ డిపో వద్ద బస్ స్టాప్ నిర్మాణానికి ఐఎంఏ నుండి నిధులను సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. అనంతరం హౌసింగ్ బోర్డ్ లోని కళావేదిక పార్కు అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఇప్పటికే 10 లక్షల రూపాయల వ్యయాన్ని పార్కు అభివృద్ధికి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఖర్చు చేయడం జరిగిందని,మరి కొన్ని కళాకృతుల ఏర్పాటుకు వెంటనే మార్కింగ్స్ ఇవ్వాలని మున్సిపల్ సర్వేయర్ ను ఆదేశించారు. ఓల్డ్ బస్టాండ్ పుననిర్మాణానికి వెంటనే డిజైన్ లను రూపొందించి నిర్మాణ దాతకు అందజేయాలని భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంలో భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి,భీమవరం ఆర్టీసి డిపో మేనేజర్ పిఎన్‌విఎం సత్య నారాయణమూర్తి, మున్సిపల్ ఇంజనీర్‌త్రినాధ రావు,ఐఎంఏ ప్రతినిధి సిహెచ్ కృష్ణంరాజు, ప్రముఖసంఘసేవకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకట రాజు, జానపాటి మధు సుదన్ రావు,దీలిప్, భీమవరం మున్సిపాలిటీ సర్వేయర్ రమాబాయి, ఏసిపి శ్రీలత, టిపిఓ పార్థసారథి, టీపీఎస్ శాస్త్రి, ఏఎంసి వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

# బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు : 7 మద్యం సీసాల స్వాధీనం



పాలకొల్లు,మేజర్‌న్యూస్: ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆదివారం నిర్వహించిన దాడులలో, పాలకొల్లు మున్సిపాలిటీ ఏరియాలో జె ముసలయ్య నాయుడు అను వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్దనుండి 7మద్యం బాటిళ్ళును స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు, ఈ దాడులలో ఎస్ఐలు పి.మహేష్,జి.రఘు ,సిబ్బంది పాల్గొన్నారు.బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు ప్రొహిబిషన్ , ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ తెలియ చేశారు.

## పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో దాసిరాజు



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** డివిజన్లోని వివిధ మండలాల్లో ఖాళీగా ఉన్న డీలర్ పోస్టుల భర్తీకి ఆదివారం పరీక్ష నిర్వహించారు. మొత్తం 63 ఖాళీలు ఉండగా పరీక్షకు 56 మంది హాజరయ్యారు. దరఖాస్తు చేసిన ఏడుగురు హాజరు కాలేదు. స్థానిక వైఎన్ కళాశాలలో జరిగిన పరీక్షను ఆర్డీవో దాసి రాజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఐక్య ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం

**– కార్మిక–కర్షక పోరాటాలను ఉధృతం చేయాలి**




**ఏలూరు,మేజర్ న్యూస్:** ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని, కార్మిక కర్షక ఐక్యతతో పోరాటాలు ఉధృతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో కార్మిక కర్షక ఐక్యతా దినోత్సవంలో భాగంగా సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 1982 నుండి కార్మిక కర్షక హక్కుల కోసం ఐక్యత దినోత్సవం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాడు కార్మికులు రైతులు తమ హక్కుల కోసంజరిపిన పోరాటాల్లో అనేకమంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు అమరులయ్యారని గుర్తు చేశారు.నాటి నుండి నేటి వరకు పాలకులు కార్మిక,కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని విమర్శించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు కె. విజయలక్ష్మి కార్మిక కోడ్‌ల పేరుతో 44 కార్మిక చట్టాలను మూడు కోడ్‌లుగా మార్చి నిర్బంధ శ్రమ దోపిడీకి పూనుకోవాలని చూస్తుందన్నారు.ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, కె.వి.పి.ఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, జిల్లా నాయకులు ఎం.ఇస్సాక్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పి మంగరాజు మాట్లాడుతూ మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించాలని చూసిందని అన్నారు. ఉపాధి హామి పథకంలో ఆన్లైన్ పేమెంట్,ఆన్లైన్ మాస్టరు,ఆధార్ కార్డు అను సంధానం పేరుతో కూలీల సంఖ్యను తగ్గించే ప్రయత్నం జరుగుతోందన్నారు. బడ్జెట్లో నిధులను పూర్తిగా తగ్గించిందని దీనివల్ల పని దినాలు తగ్గిపోయాయని చెప్పారు.

# రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరణ పొడిగింపు

**– సబ్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్**

**నూజివీడు, మేజర్ న్యూస్ :** ఏలూరు జిల్లా నూజివీడు డివిజన్ లో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ల నియామకానికి ఈనెల 10వ తేదీన ప్రకటన జారీచేయడం జరిగిందని, సదరు దరఖాస్తు స్వీకరణకు తుది గడువును ఈనెల 19వ తేదీ నుండి 22వ తేదీ వరకు సాయంత్రం 5 గంటలవరకు పొడిగించడం జరిగిందని నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 22 వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం లేదా, సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయాలు లేదా, తమ దగ్గరలోని గ్రామ/వార్డ్ సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ తెలియజేసారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా యోగివేమన జయంతి





**వేమన శతకంలోని పద్యాలను వినిపించి అబ్బురపరిచిన కలెక్టర్, జెసి,అధికారులు**

**ఏలూరు,మేజర్ న్యూస్:** తేట తెలుగు పదాలతో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో శతకాల ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన ప్రజాకవి యోగివేమన అని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు.

ఆదివారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగివేమన జయంతి వేడుకలు సందర్భంగా యోగివేమన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు,పాల్గొన్నడిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు,జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జెడి గోవిందరాజులు, జిజిహెచ్ సూపరింటెండెంట్ ఎంఎం రాజు, సెట్ వెల్ సిఇఓ ప్రభాకరరావు, బి.సి. కార్పోరేషన్ ఇడి ఎన్. పుష్పలత, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఆర్.వి. నాగరాణి, ఐసిడిఎస్ పిడి శారద, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య, పర్యాటక శాఖ మేనేజరు పట్టాభి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వేమన పద్యాల సందేశాలను నేటి యువతతోపాటు భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ వేమన శతకంలోని 'ఎలుకతోలు తెచ్చి ఏడాది ఉతికినా నలుపు నలుపేగానీ తెలుపు రాదు. కొయ్యబొమ్మతెచ్చి కొట్టినా పలుకునా విశ్వధాభిరామ వినురవేమ' పద్యాన్ని స్వయంగా చెబుతూ ఎలుకతోలు అదే పనిగా సంవత్సరంపాటు ఉతికినా తెల్లబడదు, అదే విధంగా కొయ్యబొమ్మను కొట్టినా మాట్లాడదు అంటూ దాని తాత్పర్యాన్ని కూడా వివరించి అందరినీ అబ్బురపరిచారు. అదే విధంగా జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి కూడా వేమన శతకంలోని 'అనుగానిచోట నదికులమనరాదు కొంచెముండుటెల్ల కొదువుగాదు. కొండ అద్దమందు కొంచమైయుండదా విశ్వధాభిరామ వినురవేమ' పద్యాన్ని వినిపించి మనకు తగని ప్రదేశంలో మనల్ని మనం గొప్పవారమని చెప్పుకోవడం ఎంతమాత్రం మంచిదికాదని వాటిని ప్రదర్శించక పోయినంత మాత్రాన మన ఔన్నత్యానికి ఎలాంటి భంగం లేదని ఆపద్యం తాత్పర్యాన్ని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అధికారులు వేమన శతకంలోని పద్యాలను వాటి తాత్పర్యాలను వివరించగా కలెక్టర్ ఎంతో ఆసక్తితో ఆలకించారు.

## అన్నదాన సమాజం షాపుల పునర్నిర్మాణాలపై మంత్రితో చర్చలు



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ , అసిస్టెంట్ ఇంజనీర్ వారు దేవాదాయ శాఖ (శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులు,(శ్రీ క్షీరపురి అన్నదాన సమాజం షాపులు కాంప్లెక్స్ పునర్నిర్మాణాల నిమిత్తం జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ను కలిసి చర్చించారు, ఈ కార్యక్రమంలో పెద్ద గోపురం కార్యనిర్వాహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్ రావు, అన్నదాన సమాజం కార్య నిర్వహణ అధికారి రంగరాజన్ సిబ్బంది పాల్గొన్నారు,

# చేనేత కార్మికులకు సిఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలి




**- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి బాలకృష్ణ**

**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** స్థానిక 12వ వార్డు వీవర్స్ కమిటీ హాల్లో ఏపీ చేనేత కార్మిక సంఘం వీవర్స్ యునైటెడ్ ఫ్రెండ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి బాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సమావేశానికి వీవర్స్ యునైటెడ్ ఫ్రెండ్ జిల్లా కన్వీనర్ కనకం వరప్రసాద్‌అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత చేనేత ప్రధానమైన వృత్తి అని చెబుతున్న పాలకులు బడ్జెట్లో చేనేతకు నిధులు లేకుండా చేయడం అన్యాయమని అన్నారు. తక్షణం చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి 2వేల కోట్ల రూపాయలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అమలు జరిపిన సంక్షేమ పథకాలన్నిటిని అమలు జరుపుతానని చెప్పిన కూటమి ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం అమలు జరపకుండా రద్దు చేయడం అన్యాయమని అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం రోజున 200 యూనిట్లు ఉచిత కరెంటు చేస్తానని, జీఎస్టీ రద్దు లేదా రీయంబర్స్మెంట్ చేస్తానని ప్రకటించి ఇప్పటికీ అమలు జరపకుండా చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 30శాతం రిబేటు సంవత్సరం మొత్తం కొనసాగించాలని, నేతను నేస్తం మగ్గం నేస్తున్న ప్రతి చేనేత కార్మికునికి ఇవ్వాలని బోగస్ చేనేత సహకార సంఘాలను రద్దు చేయాలని, పనిచేస్తున్న సహకార సంఘాలను ప్రోత్సహించాలని, చేనేత కార్మికులకు మూడు సెంట్లు స్థలంలో మగ్గం షెడ్డుతో కూడిన ఇల్లు నిర్మించాలని,స్వంత స్థలం ఉన్న కార్మికునికి ఇల్లు నిర్మాణానికి 6 లక్షల రూపాయలు మంజూరు చేయాలని ప్రైవేట్ సెక్టార్ లోని చేనేత కార్మికులకు త్రిఫ్ట్ ఫండు స్కీంను అమలు చేయాలని, పట్టు, జరీ నూలు ధరలను 2021 నాటికి తగ్గించాలని, 40 శాతం రాయితీ ఇవ్వాలని చేనేత మహిళలకు ప్రసూతి సమయంలో ఆర్థిక సహాయం చేయాలని చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు అమలు జరపాలని సంఘం డిమాండ్ చేసింది. ఈసమస్యల పరిష్కారానికై జనవరి 24న భీమవరం జిల్లా ఏడి కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో చేనేత కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏపీ చేనేత కార్మిక సంఘం బూడిద జోగేశ్వరరావు, వాసా రామలింగం వరద బసవకోటయ్య, సమతం చిన్న సముద్ర లింగం,వీవర్స్ యునైటెడ్ ఫ్రెండ్ నాయకులు ఒగ్గు సత్యనారాయణ,బళ్ళ రమేష్ కుమార్,రాపర్తి సత్యనారాయణ భీమేశ్వరరావు,సందకర్లసూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు కేంద్రమంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలి

**- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత వరప్రసాద్ డిమాండ్**




**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** తాడేపల్లిగూడెం శేష మహల్ సెంటర్లో జరిగిన నిరసన కార్యక్రమంలో దానవరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాజ్య సభలో అంబేద్కర్, అంబేద్కర్ అంటూ అంబేద్కర్ ఆదరించడం కాదు అదేదో దేవుడిని ఆరాధిస్తే ముక్తి అన్న దొరుకుతుంది అని అమిత్ షా వ్యాకరించడం అంబేద్కర్ వాదులను అంబేద్కర్ను అవమానపరచడమే అవుతుందని అన్నారు. ప్రపంచంలో మేధావి దళితుల ఆశాజ్యోతి అయినా అంబేద్కర్ దళిత బహుజన వర్గాలు మరియు దేశ ప్రజలు ఆరాధిస్తున్నటువంటి ప్రపంచ మేధావి అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవమానపరచడం దళిత బహుజన వర్గాలను అంబేద్కర్ను అవమాన పర్చడమేనన్నారు. సోమనాదం కమిషన్ రిపోర్ట్ ను అమలు చేయాలని నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని స్వామినాథ కమిషన్ వెంటనే అమలు చేయాలని రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని అమీషాను మంత్రివర్గం నుండి తొలగించాలని అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరు ఎవరిని ఆరాధించాలనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. అంబేద్కర్ను అవమానపరిచిన అమీషాపై కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని పక్షంలో దళిత బహుజన వర్గాల సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉదయరాజు, దుర్గాప్రసాద్, నూకరాజు,లక్ష్మణరావు, కొల్లి శ్రీను,దుర్గారావు, గవరరాజు ,అసిన్ భాష,రాంబాబు,శ్రీను,పోతురాజుతదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బైకులు,కార్లకు జీవిత పన్ను మినహాయింపు



భీమవరం,మేజర్‌న్యూస్: విద్యుత్ బైకులు,కార్లకు జీవిత పన్ను (లైఫ్ టాక్స్) మినహాయింపు అవకాశాన్ని జిల్లాలో నూతన విద్యుత్ వాహన కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రవాణా అధికారి టి.ఉమా మహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019కి ముందు విద్యుత్ వాహనాలు కొనుగోలుపై అమలు కాబడిన జీవిత పన్ను మినహాయింపుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరల ఈనెల నుండి అమలులోకి తీసుకొచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కాలుష్యం రోజు రోజుకు తీవ్రమవుతున్న దృష్ట్యా,వాయు కాలుష్య నియంత్రణ చర్యలలో భాగంగా ప్రభుత్వం విద్యుత్ వాహనముల ద్వారా కాలుష్యం తగ్గించవచ్చుని సమీక్ష చేసి, విద్యుత్ బైకులు, కార్లకు జీవిత పన్ను మినహాయింపు మరల అమలులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

మన రాష్ట్రంలో కొనుగోలు చేసిన,రిజిస్టర్ చేసుకున్న అన్ని స్వచ్ఛమైన ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నును మినహాయిస్తూ ఐదు సంవత్సరాల కాలం పరిమితికి ఈనెల నుండి జనవరి 2030 వరకు అమలులో ఉండేలా ఉత్తర్వులు జారీచేయడం జరిగిందని తెలిపారు.పన్ను మినహాయింపు స్వచ్ఛమైన ఎలక్ట్రిక్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని, హైబ్రిడ్ వాహనాలకు వర్తించదన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ టి.ఆర్ జారీ చేసిన వాహనాలకు మరియు ఆంధ్రప్రదేశ్‌లోని డీలర్లు ఇతర రాష్ట్రాలకు టి.ఆర్‌లు జారీచేసిన లైఫ్ టాక్స్ మినహాయింపు వర్తించదని తెలిపారు. రాష్ట్రం వెలుపల ఎలక్ట్రిక్ టి.ఆర్ పట్ల విద్యుత్ వాహన కొనుగోలు దారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు కోరారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం






**– 2004 – 2005 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల భేటీ**

**పెంటపాడు,మేజర్ న్యూస్ :** 2004 – 2005 సంవత్సరంలో పదవ తరగతి అభ్యసించిన విద్యార్థులు తిరిగి 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని వారి పదవ తరగతి చదువుతున్న రోజులు నాటి జ్ఞాపకాలను, మధురస్మృతులను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్ టి వి ఎన్ హెచ్ హెచ్ పాఠశాలలో అప్పటి రోజుల్లో విద్యను అభ్యసించడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి పెంటపాడు, తాళ్ల ముదునూరు పాడు, దర్శిపర్రు,వల్లూరుపల్లి, జట్లపాలెం, ఉమామహేశ్వరం గ్రామాల నుండి అనేక మంది విద్యార్థులు విద్యను అభ్యసించడానికి స్కూలుకు వచ్చేవారు. మరి వారందరూ కూడా ఈరోజు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారికి విద్యను అభ్యసించినటు వంటి అప్పటి ఉపాధ్యాయులు ప్రస్తుతం ఎస్టీ వీ యన్ హెచ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవాచార్యులు వ్యాయామ ఉపాధ్యాయులు రామకృష్ణా రెడ్డి, తెలుగు పండితులు ప్రభాకర్ శాస్త్రి, సంస్కృతం మాస్టారు శ్రీరామచంద్రమూర్తి గణితశాస్త్రం పండితురాలు శ్రీదేవి, తెలుగు పండితురాలు రాజేశ్వరి, సాంఘిక శాస్త్రం మాస్టారు రామారావు, మరొక వ్యాయామ ఉపాధ్యాయులు కన్నా రెడ్డిని, నారాయణ రావు మాస్టర్ ని, రవి మాస్టర్ లను సన్మానించడం జరిగింది. ఈ పూర్వ విద్యార్థులందరూ కూడా సాయంత్రం వరకు స్కూలు ఆవరణలో ఆట పాటలతో గడుపుతూ ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ ప్రస్తుతం వారి విధివిధానాల గురించి చర్చించుకుంటూ సరదాగా గడిపారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి రవికిరణ్, నాగరాజు, ఏసురెడ్డి, భరద్వాజ్, కొండరాజు, సుబ్రహ్మణ్యం తదితరులు ఆర్గనైజర్లగా వ్యవహరించి వచ్చిన అతిథులందరినీ సత్కరించారు.

# భద్రతా నియమాలు పటించాలి

**:మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నాయక్**



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఈ నెల 16వ తేదీ నుండి ఫిబ్రవరి 15వ తేదీ వరకు రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా తాడేపల్లిగూడెం డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రారంభ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాడేపల్లి గూడెం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ డి ఎస్ ఎస్ నాయక్ విచ్చేశారు. రోడ్డు భద్రత అంటే చోదకులు, బస్సు ప్రయాణికులు,రోడ్డు మీద నడుస్తున్న ఇతర పాదచార్లు, ఇతర వాహన చోదకుల భద్రత కనుక ప్రతి ఒక్కరూ సమిష్టిగా ఈ భద్రతానియమాలు పాటించాలని చెబుతూ సిబ్బంది అందరూ తమ తమ ఆహార అలవాట్లు ,శారీరక వ్యాయామం పట్ల శ్రద్ధ వహించి మెరుగైన నైపుణ్యం చూపించే విధంగా శారీరక మానసిక ఆరోగ్యాన్ని దృఢతరం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. డిపో మేనేజర్ మూర్తి మాట్లాడుతూ ఈ మాసోత్సవాల ప్రాధాన్యత,ఈ మాసోత్సవాల సందర్భంగా నిర్వహించేటు వంటి కార్యక్రమాల వివరాలు దశలవారీగా వివరించి, అందరి టార్గెట్ అయినా జీరో ప్రమాదలక్ష్యాన్ని సాధించే దిశగా కండక్టర్ డ్రైవర్లు మెకానికల్ సూపర్వైజర్లు కూడా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశానికి కండక్టర్లు డ్రైవర్లు గ్యారేజ్ సిబ్బంది, సూపర్వైజర్లు అసోసియేషన్ నాయకులు హాజరయ్యారు.

# అమిత్ షా గో బ్యాక్ : వామపక్షాల నిరసన




**– అంబేద్కర్‌ను అవమానించినందుకు మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలి**

**ఏలూరు,మేజర్‌న్యూస్:** పార్లమెంటులో డాక్టర్ బి.ఆర్అంబేద్కర్‌ను అవమానిస్తూ వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాల పార్టీల రాష్ట్ర పిలుపు మేరకు ఆదివారం ఏలూరులోని సిపిఎం, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ పార్టీల ఆధ్వర్యంలో అమిత్ షా గో బ్యాక్ అంటూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంబూరు శ్రీమన్నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ను అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని, లేకుంటే కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ పై అమిత్ షా అహం కారపూరితంగా, అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.దేశంలో దళిత, గిరిజన, మహిళ లపైన,మైనార్టీల పైన దుర్మార్గమైన దాడులు,అవమానాలు జరుగుతున్నా ఏమాత్రం మాట్లాడని ప్రధాని మోడీ అంబేద్కర్‌ను అవమానపరిచినా అమిత్ షాను వెనుకేసుకురావడం దుర్మార్గమన్నారు. కేంద్ర మంత్రి పదవి నుండి అమిత్ షాను తొలగించాలని కోరారు.ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ,సిపిఎం నాయకులు పిచ్చుక ఆదిశేషు, ఎ.శ్యామలారాణి,ఎం. రామాంజనేయులు,ఎస్.సత్య నారాయణ, ఏసుబాబు,మీసాల సత్యనారాయణ, సిపిఐ (ఎంఎల్ ) న్యూ డెమొక్రసీ నాయకులు ఈమని మల్లిక,కాకి నాని, మహర్షి, జి.రాంబాబు, నాగేశ్వం రావు, అప్పారావు,త్రినాధ్,రవణ,అన్నవరం,విష్ణు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంపు పట్ల రైతు సంఘం ఆందోళన




**ఏలూరు,మేజర్ న్యూస్:** కాంప్లెక్స్ ఎరువుల ధరలు దారుణంగా పెంచి వేయడం దారుణమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఏలూరు అన్నే భవనంలో పెంచిన ఎరువుల ధరలపై అయన మాట్లాడారు. 10-26-26 కాంప్లెక్స్ ఎరువుల ధర రూ.1470 కాగా రూ.1720 లకు, 12-32-16 ధర రూ. 1480 కాగా రూ.1720 లకు, 20-20-13 ధర రూ.1200 కాగా రూ.1300 లకు పెంచడం వలన రైతులపై విపరీతం భారం పడుతుందని చెప్పారు. ఇప్పటికే వ్యవసాయ నష్టాలతో ఉన్న అన్నదాతలకు పెరిగిన ఎరువుల ధరల వలన మరింత నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలని కోరారు.

– ధాన్యం కొనుగోలు నిలిపివేత తగదు – రైతుల పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయకుండా కొనుగోళ్లు నిలిపివేయడం తగదన్నారు. టార్గెట్ పేరుతో అన్నదాతలను ఇబ్బందులకు గురి చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.కృష్ణా డెల్టా పరిధిలో రబీ పంటకు సాగునీరు అందించకపోవడంతో రైతులు ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో వరి కుప్పలు వేసుకుని ఫిబ్రవరి, మార్చి మాసాలలో కుప్పల నూర్పిడి చేసి ధాన్యం అమ్ముకుంటారని కాబట్టి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

## గుండుగొలనులో ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు





**భీమడోలు,మేజర్ న్యూస్:** మండలం గుండుగొలను శ్రీసీతారామస్వామి ఆలయ ఉపాలయమైన త్యాగరాజ ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ చైర్మన్ కొండా గంగరాజ్ కుమార్ పర్యవేక్షణలో అర్చకులు సుధీరాచార్యులు బృందం వేదమంత్రాలతో శ్రీసీతారామస్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా సీతారామస్వామికి శాంతికళ్యాణం జరిపి త్యాగరాజ స్వామికి శ్రీసీతారామదర్శనం చేసారు. ఈసందర్భంగా చైర్మన్ గంగరాజ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుంచి 20వతేది సోమవారం వరకు గుండుగొలను శ్రీసీతారామస్వామి ఆలయ ఉపాలయమైన త్యాగరాజ ఆలయంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం,సాయంత్రం త్యాగరాజస్వామికి ప్రత్యేక పూజలు, భజనలు,సంకీర్తనలు ఆలపించడం జరుగుతుందన్నారు. ప్రతి ఏటా ఆలయంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# సంతోషపురం మాజీ ఎంపిటిసి హత్య కేసులో ముద్దాయి అరెస్ట్



కైకలూరు,మేజర్ న్యూస్ : కలిదిండి మండలం సంతోషపురం గ్రామ మాజీ ఎంపిటిసి కాల్వ నల్లయ్యను పక్కా ప్లాన్ ప్రకారం హత్య చేసిన ముద్దాయి బోధనపు శ్రీనుని కలిదిండి పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఏలూరు డిఎస్పి డి శ్రావణ్ కుమార్ తెలిపారు. ఆదివారం కైకలూరు రూరల్ సర్కిల్ కార్యాలయం నందు సీఐ వి.రవికుమార్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటుచేసి హత్యకు గల కారణాలను డి.ఎస్.పి వివరించారు. పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కలిదిండి మండలం సంతోషపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి, మాజీ ఎంపిటీసీ కాల్వ, నల్లయ్య (55) కలిదిండిలో నివాసం ఉంటూ సంతోషపురం గ్రామంలో చేపల చెరువు వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. గురువారం సాయంత్రం మోటార్ సైకిల్పై కలిదిండి వస్తుండగా సంతోషపురం - భోగేశ్వరం రోడ్డులో సంతోషపురం గ్రామానికి చెందిన బోధనపు శ్రీను పాతకక్షల నేపథ్యంలో పక్కా ప్లాన్ ప్రకారం మోటార్ సైకిల్తో నల్లయ్యను ఢీకొట్టి నల్లయ్యను ఐరన్ రాడ్తో తలపై కొట్టి కత్తితో దాడి చేశాడు. దీంతో నల్లయ్యకు రక్త గాయాలై కింద పడిపోయాడు. వెంటనే శ్రీను అక్కడి నుంచి పరారు కాగా దారిన వెళ్లేవారు నల్లయ్య కుమారుడుకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న నల్లయ్య కుమారుడు ఆంజనేయులు కారులో కలిదిండిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ తీసుకువచ్చి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం భీమవరంలోని ఓ ప్రైవేటు హాస్పటల్కి తీసుకువెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ నల్లయ్య గురువారం సాయంత్రం మృతి చెందినట్టు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటేశ్వరావు కేసు నమోదు చేశారు. కైకలూర్ రూరల్ సిఐ వి. రవి కుమార్ దర్యాప్తు జరిపి జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారముగా డి.ఎస్.పి ప్రత్యక్ష పర్యవేక్షణలో కేసు పరిశోధన చేసి నేరస్తుడు అయిన భోదనపు శ్రీనివాసరావును 19వ తేదీన మధ్యాహ్నాము అతని ఇంటివద్ద అరెస్టు చేసి,నేరమునకు వుపయోగించిన ఇనుప రాడ్, కత్తిని దర్యాప్తు లో భాగంగా స్వాధీనపర్చుకున్నారు. చురుకుగా దర్యాప్తు చేసి అతి తక్కువ సమయములో కేసు ను ఛేదించి ముద్దాయిని అరెస్టు చేసిన కైకలూర్ రూరల్ సీఐ వి.రవి కుమార్ ,వారి సిబ్బంది ని డిఎస్పి డి. శ్రవణ కుమార్ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్సై రామచంద్రరావు, రూరల్ ఎస్సై వి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి ఎవరికి డబ్బులు చెల్లించవద్దు

**– 3 రోజుల్లో సబ్సిడి సొమ్ము ఖాతాల్లో జమ : జేసి**



ఏలూరు,మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా అర్హులు అయిన పేద కుటుంబాల వారికి సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చెయ్యడం జరుగుతున్నదనీ జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంలో ఏలూరు జిల్లాలో ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పొందుతున్న సిలిండర్లకు తాము చెల్లించిన నగదు మూడు రోజుల్లోపు తమ ఖాతాల్లో జమ అవుతున్నాయని లబ్దిదారులు తెలుపుతున్నారని అన్నారు. అదేవిధముగా లబ్దిదారులు దీపం 2 ఉచిత గ్యాస్ పథకం కింద చెల్లించాల్సిన అసలు బిల్లుకు అదనంగా రూ.80 నుండి రూ.150 వరకు కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్ లు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపధ్యములో రెవెన్యూ , పౌరసరఫరాల సిబంది,గ్యాస్ ఏజెన్సీ సేల్స్ అధికారులతో సమావేశం నిర్వహించి లబ్దిదారులనుంచి వచ్చిన ఫిర్యాదులు రుజువు అయ్యిన యెడల సదరు గ్యాస్ ఏజన్సీల పై తగు చర్యలు తీసుకోనబడుతుందని వివరించారు. అట్టి ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టి వారి లైసెన్సులను రద్దు చేయడం జరుగుననీ హెచ్చరించారు. ఈ పథకం కింద ఏ ఒక్కరూ ఎటువంటి అదనంగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆ విధముగా కాకుండా లబ్దిదారుల నుండి గ్యాస్ ఏజెన్సీలు అదనంగా డబ్బులు వసూలు చేసినచో 18004256453 టోల్ ఫ్రీ నెంబర్లుకి కాల్ చేసి ఫిర్యాదు. చేయవచ్చని జేసి ధాత్రిరెడ్డి తెలిపారు.

## శెట్టిబలిజ సంఘీయుల క్యాలెండర్ ఆవిష్కరణ



ఏలూరు.మేజర్ న్యూస్: స్థానిక పవర్ పేట బడేటి క్యాంపు కార్యాలయంలో శెట్టిబలిజ సంఘీయుల నూతన క్యాలెండర్ ను శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## కలుషిత నీరు తాగి 7 పశువులు మృతి



కొయ్యలగూడెం ,మేజర్ న్యూస్: కొయ్యలగూడెం మండలం రాజవరం గ్రామంలో ఏడు పశువులు ఆదివారం సాయంత్రం మృతి చెందాయి. పురుగుమందు కలిపిన కలుషిత నీరు తాగి మూడు గేదెలు, రెండు ఆవులు, రెండు దూడలు చనిపోయాయని బాధిత రైతు వట్టిపోలు సాయిబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

చనిపోయిన పశువులు విలువ సుమారు నాలుగున్నర లక్షల రూపాయలు ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

# జి.సి.జి.టి.ఏ.జిల్లా అధ్యక్షులుగా మర్రి వేంకటేశ్వర రావు



ఏలూరు,మేజర్ న్యూస్: జి.సి.జి.టి.ఏ.ఏలూరు జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ఏలూరులో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఏలూరు జిల్లాలోలో గల వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేయుచున్న జి.సి.జి.టి.ఏ. అధ్యాపకులు హాజరై జిల్లా స్థాయి పదవులకు అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. జి.సి.జి.టి.ఏ.జిల్లా అధ్యక్షులుగా మర్రి వేంకటేశ్వర రావు,ప్రభుత్వ డిగ్రీ కళాశాల బుట్టాయగూడెం జిల్లా కార్యదర్శిగా టీవీ రాంబాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంగారెడ్డి గూడెం జిల్లా కోశాధికారిగా కె.రమేష్,ప్రభుత్వ డిగ్రీ కళాశాల కైకలూరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ ఎన్నికలకు డా. ఎమ్.రాంబాబు,జిల్లా జి.సి.టి.ఏ. ప్రెసిడెంట్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.ఈ ఎన్నికలకు వివిధ కళాశాలల అధ్యాపకులు హాజరయ్యారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏలూరు జి.సి.టి.ఏ. యూనిట్ సభ్యులు మరియు ప్రిన్సిపాల్ డా.జి.గిరిబాబు ఎన్నికల నిర్వహణకు సహాయ సహకారాలు అందించారు. ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు,సంఘ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలియజేసారు.

## చట్ట ప్రక్రియలపై అభయ మహిళా రక్షణ దళం అవగాహన



ఏలూరు,మేజర్ న్యూస్: జిల్లాలో ప్రప్రథమంగా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి సమాజంలో జరుగుతున్న టువంటి అనర్థాలను గురించి ప్రజల్లో చైతన్యం తిసుకోనువచ్చుట కొరకు మహిళల, బాలికల,వృద్ధుల రక్షణ కొరకు, అభయ దృశ్య రూపక (వీడియో) వాహనం ద్వారా చట్ట ప్రక్రియ లపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఆదివారం స్థానిక కంద్రిక గూడెం తదితర ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం సుబ్బారావు,మహిళా ఎస్సై కాంతిప్రియ,సిబ్బందితో అభయ మహిళా రక్షణ వాహనం ద్వారా మహిళలు,బాలికలు, వృద్ధులు, సమాజంలో అటువంటి బలహీన వర్గాలకు చట్టాల ద్వారా రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ విషయం గురించి ప్రజలు 1098 హెల్ప్లైన్ నెంబరు ద్వారా సమాచారాన్ని అందించవచ్చు.సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలు,దానివలన కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెంటనే సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 గురించి అవగాహనను,అత్యవసర పరిస్థితుల్లో సత్వర సహాయం పొందేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 112 ను వినియోగించవచ్చు. పోలీసులు ఇచ్చే సేవల పట్ల ప్రజలలో విశ్వాసం పెంచుతూ, అత్యవసర సేవలు వేగంగా అందించేందుకు చర్యలు తీసు కుంటున్నారు. ఎస్పీ సూచనలు జిల్లాలో ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా సామాజిక సమస్యలు ఉన్న సందర్భంలో ప్రజలు వెంటనే 9550351100 నెంబరు ద్వారా వాట్సాప్ ద్వారా సమాచారాన్ని తెలియజేయాలి.

## మిసెస్ ఇండియా పోటీల్లో నూజివీడుకు చెందిన డాక్టర్ రాజ్యలక్ష్మి ఎంపిక



నూజివీడు,మేజర్ న్యూస్: మిసెస్ ఇండియా పోటీల్లో నూజివీడుకు చెందిన యక్కల రాజ్యలక్ష్మి విజేతగా ఎంపికయింది. మిసెస్ ఇండియా పోటీల్లో మిస్సెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్, మిస్సెస్ ఎంపవరింగ్,మిస్సెస్ పాపులర్ అవార్డులు దక్కించుకున్న నూజివీడుకు చెందిన వైద్యురాలు వై రాజ్యలక్ష్మిని పలువురు అభి నందించారు.క్లాసిక్ క్యాటగిరిలో జరిగిన పోటీల్లో మిసెస్ ఆంధ్రప్రదేశ్ కిరీటం దక్కించుకున్న నూజివీడుకు చెందిన దంత వైద్యురాలు వై.రాజ్యలక్ష్మి. పట్టణంలోని జనతా హాస్పటల్ లో డెంటిస్ట్ గా విధులు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా 60 మంది పోటీల్లో పాల్గొనగా అత్యంత ప్రతిభ, తెలివితేటలు ప్రదర్శించి మిసెస్ ఆంధ్రప్రదేశ్ కిరీటాన్ని ఆమె దక్కించుకున్నారు. ఈనెల 12వ తేదీ తెలంగాణాలోని శంషాబాద్ సిటాడెల్ హోటల్ అండ్ కన్వెన్షన్ లో నిర్వహించిన మిస్సెస్ ఇండియా తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ 2025 గ్రాండ్ ఫినాలేలో పోటీలలో మిస్సెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ కిరీటాన్ని రాజ్యలక్ష్మి దక్కించుకుంది.40 సంవత్సరాల వయస్సు పైబడిన కేటగిరీలో జరిగిన గ్రాండ్ ఫినాలేలో 60 మంది వివాహితులు పాల్గొనగా మిసెస్ ఆంధ్ర ప్రదేశ్ గా ఆమె ఎంపికయ్యారు. ప్రపంచానికి మహిళా శక్తిని, ప్రాధాన్యతను తెలియజేయాలన్న ఉద్దేశంతో ఈ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. మహిళను తక్కువ చేసి మాట్లాడుతున్న సందర్భంలో మహిళ ఒక శక్తి అని చాటి చెప్పడానికి ఈ పోటీల్లో పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. మిస్సెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ గా ఆరుదైన గౌరవం దక్కించుకోవడం సంతోషంగా ఉందని, నూజివీడు పేరును ప్రపంచానికి తెలియజేయడమే తన ప్రధాన ఉద్దేశం అన్నారు. తన భర్త సహాయ సహకారాలతో ఈ విజయాన్ని సాధించడం జరిగిందని అన్నారు.

# సమాజాన్ని చైతన్య పరిచిన ప్రజాకవి యోగి వేమన


– మంత్రి డా.నిమ్మల రామానాయుడు



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** శ్రీ యోగి వేమన రచనలు ద్వారా సమాజాన్ని చైతన్య పరిచిన అభ్యుదయ వాది,ప్రజాకవి, సంఘ సంస్కర్త శ్రీ యోగి వేమన జయంతి స్పూర్తి ధాయకం అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం జలవనరుల శాఖ మంత్రి కార్యాలయంలో కోనసీమ జిల్లా – విశ్వేశ్వరాయపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఇంగ్లీషు ఉపాధ్యాయులు చెన్నావరపు శ్రీనివాసరావు రూపొందించిన శ్రీ యోగి వేమన ఇంగ్లీషు టూ తెలుగు బుక్కు లెట్స్ ను మంత్రి రామానాయుడు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో రుగ్మతలను చీల్చి చెండాడిన సంఘసంస్కర్త,కవి మహా యోగి వేమన జీవిత చరిత్రను భావితరాలకు అందించ వలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.వేమన పద్యాలలో సమాజ హితం ఉంటుందని, అలతి పదాల పద్యాలతో అనంత అర్థం ఉంటుందన్నారు. పాతుకు పోయిన దురాచారాలు,మూఢ నమ్మకాలు,మోసాలు, లోపాలు,తప్పులను ఎత్తి చూపారన్నారు. వేమన పద్యాలు తెలియని తెలుగు ప్రజలు లేరని, ఆయనను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో గండేటి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి పెద్దిరాజు,వట్టం గణేశ్వర రావు,విన్నకోట వెంకట రమణ,అందెకోట వీరభద్రం,ఉపాధ్యాయులు చెన్నావరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ చే పేద విద్యార్థినికి సైకిల్ అందజేత



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** తాడేపల్లిగూడెం రూరల్ మండలం అమృతపురం గ్రామానికి చెందిన జాహ్నవి దండగర హై స్కూల్లో 9వ తరగతి చదువుతున్నది. అమృతపురం నుంచి స్కూలుకి నడిచి వెళుచున్నది. ఈ అమ్మాయి చాలా యాక్టివ్‌గా చదువుతుంది. మంచి మార్కులతో చదవడం జరుగుతుంది. తనకి సైకిల్ ఎవరైనా సహాయం చేస్తే స్కూలుకు వెళ్ళుటకు చాలా సౌకర్యంగా ఉంటుందని, ఇంకా బాగా చదవగలనని తెలిపింది. దీనితో గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఫౌండర్ త్రికళ స్పందించి దాతలు అవినాష్ దంపతుల ద్వారా ట్రస్టీ చెన్నా జనార్ధన్ రావు ద్వారా సైకిల్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంద బ్రహ్మాజీ మాట్లాడుతూ ఎక్కడ అవసరాలుంటాయో అక్కడ త్రికళ సహకారం తో అవి నిర్వహించటం, అలాగే ఎన్నో సేవా కార్యక్రమాలు సమాజానికి ఉపయోగపడే విధంగా చేయడం అభినందనీయం అన్నారు. త్రికళ కి భగవంతుడు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు ప్రసాదించి ఇలాంటివి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.చెన్న జనార్దన్ రావు మాట్లాడుతూ జాహ్నవి చాలా చురుగ్గా చదువుతూ ఇంకా ముందు ముందు మంచి మార్కులతో ఉత్తీర్ణురాలు అవ్వాలని కోరుకుంటూ ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన అవినాష్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో టీచర్ కొమ్మన ప్రకాష్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత నేత్ర వైద్య శిభిరంలో 96 మందికి పరీక్షలు



తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జనతా ట్రస్ట్ నిర్వహణలో అధ్యక్షులు వివిఎన్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పీఎంజేఎఫ్ లయన్ పదం కుమార్ గుప్తా ఆర్థికసహకారంతో రాజ రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ హాస్పిటల్, నిడదవోలు సిబ్బంది ఆదివారం కడ కట్ల జనత హాస్పిటల్ నందు ఉచిత నేత్ర శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం ఇంచార్జ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ప్రారంభించారు. ఈ ఉచిత నేత్ర శిబిరంలో 96 మంది పరీక్ష చేయించుకున్నారు. 20 మందికి కళ్లజోళ్ళు ఇచ్చారు. ఆపరేషన్స్ నిమిత్తం 10 మందిని నిడదవోలు హాస్పిటల్ కు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా లయన్ చక్కా అప్పారావు (టెక్నికల్ డైరెక్టర్, వాసవి ఇంజనీరింగ్ కాలేజ్ ,తాడేపల్లిగూడెం) లయన్ సుంకర శ్రీనివాసరావు (జోన్ చైర్మన్), కార్యదర్శి చిన్నం జగదీష్ ,భీమవరపు మహాలక్ష్మి(కోశాధికారి),ఎల్ ఎస్ వి నాగేశ్వరావు(జనత డాక్టర్), గ్రంధిసత్యనారాయణ,సన్నిధి సూర్యనారాయణ మూర్తి, వెంకటేశ్వరరావు,రామకృష్ణ, మొదలగు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# నేటి నుండి 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిభిరాలు : జిల్లా కలెక్టర్




**ఏలూరు,మేజర్న్యూస్:** జిల్లా వ్యాప్తంగా ఈనెల 20వ తేదీ నుండి 31 వ తేదీ వరకు నిర్వహించే పశు ఆరోగ్య శిభిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ పశుసంవర్ధకశాఖ ఆద్వర్యంలో నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుతవం పశుపోషకులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ తగినన్ని నిధులు కేటాయిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునిస్తుందన్నారు. పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణకు జిల్లాలో గల 27 మండలాల్లో మండలానికి రెండు టీములు చొప్పున ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఒక్కొక్క టీములో ఒక పశు వైద్యుడు,ఒక పారా వెటరినరీ సిబ్బంది, పశువైద్య సహాయకులు ఇంకా గోపాలామిత్రులు వుంటారన్నారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఇన్ చార్జి జెడి డా. టి. గోవిందరాజు మాట్లాడుతూ ఈ పశు ఆరోగ్య శిభిరాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు త్రాగించడం, అదేవిదంగా లేగదూడలకు, పాడి పశువులకు కూడా నట్టల నివారణ మందులు త్రాగించడం జరుగుతుందన్నారు.

దీంతో పాటుగా 14 మండలాల్లో లేగదూడల అందాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పాడి రైతులను ఉత్సాహపరిచేందుకు, లేగదూడల పెంపకం పట్ల అవగాహన కలిగించేదుకు ఈ లేగదూడల అందాలప్రదర్శనని ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఈక్యాంపుల గురించి రైతుల్లో అవగాహన కలిగించ డానికి పోస్టర్లు, కరపత్రాలు ఏర్పాటు చేయడమైనదన్నారు. కాబట్టి జిల్లాలో గల రైతు సోదరులందరు ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఉపయోగించుకోవాలని కోరారు.

# కేంద్ర మంత్రి అమిత్ షాకు ఘన స్వాగతం పలికిన మంత్రి పార్ధసారధి





**ఆగిరపల్లి,మేజర్న్యూస్:** కేంద్ర మంత్రి అమిత్ షా ఎన్‌టిఆర్ జిల్లా పర్యటన ఏర్పాట్లను దగ్గరుండి ఒక సామాన్య కార్యకర్తలా ఇటు కార్యకర్తలను అటు నాయకులను,మహిళలను ,యువతతో కలిసి సుమారు 10 వేల మందితో ఘన స్వాగతం పలికిన మంత్రి కొలుసు పార్థసారథి. అమిత్‌షాకు,ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడుకి జన సమూహంతో ఇటు పూల వర్షంతో అటు పార్టీ జెండాలతో ఘన స్వాగతం పలికిన మంత్రి కొలుసు పార్ధసారది. మంత్రి ఒక సామాన్య కార్యకర్తలా కేంద్ర మంత్రి పర్యటనకు వచ్చే దారి మార్గంలోనడుచుకుంటూ పోలీసు యంత్రాంగానికి పార్టీ నాయకులు కార్యకర్తలకు సూచనలు ఇచ్చారు.

# చదువుతో పాటు క్రీడల పట్ల అసక్తి కలిగి ఉండాలి : ఆర్డీవో దాసిరాజు



**నర్సాపురం రూరల్,మేజర్న్యూస్:** చదువుతోపాటు క్రీడాశక్తి కలిగి ఉండటం వల్ల జాతీయ అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి గడించవచ్చునని ఆర్డిఓ దాసిరాజు అన్నారు. ఆదివారం మండలంలోని గొంది గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రధానోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు గ్రామ సర్పంచ్ మద్దాల శ్రీకృష్ణాంజనేయులు అధ్యక్షత వహించారు. సభలో ఆర్డీవో మాట్లాడుతూ గ్రామస్థాయి క్రీడా పోటీలలో పాల్గొన్న ఎంతోమంది అంతర్జాతీయ క్రీడాకారులుగా అభివృద్ధి అయ్యారని, విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాజ ఈస్ట్, వెస్ట్ సర్పంచులు గుబ్బల వేణు, పాలంకి శ్రీనివాస్, నర్సాపురం నీటి సంఘం అధ్యక్షులు పెదపాటి శాంతరాజు, మద్దాల నాగేంద్ర కుమార్, పెదపాటి ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. మొదటి బహుమతి రాయలం గ్రామానికి చెందిన దవులూరి శేఖర్ 15వేలు బహుకరించగా,గొంది టీం గెలుచుకున్నారు. రెండవ బహుమతి 10వేలు అంగడి భాస్కరరావు బహుకరించగా పాత నవరసపురం టీం గెలుపొందింది. మూడో బహుమతి 5వేలు గొంది గ్రామానికి చెందిన ఎన్నారై ఎర్రం శెట్టి శభాష్ బహుకరించగా అడవిపాలెం టీం గెలుపొందింది. ఈ కార్యక్రమంలో దేవా నరసింహారావు, పెదపాటి విజయ్, అంగడి వెంకీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాగృతి విద్యాసంస్థలు అధినేత కిషోర్ జన్మదిన వేడుకలు



**కైకలూరు,మేజర్ న్యూస్ :** కైకలూరులో జాగృతి విద్యాసంస్థలం అతి తక్కువ సమయంలో ముందుకు తీసుకు వెళుతున్న జయ కిషోర్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఏలూరు పార్లమెంటు మాజీ సభ్యులు మాగంటి వెంకటేశ్వరరావు(బాబు) పద్మవల్లీ దంపతుల ఆధ్వర్యంలో జాగృతి విద్యాసంస్థలు అధినేత పానేం జయకిషోర్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ,రుంజుల విల్సన్,తలారి జాన్, పానేం కిరణ్,వంగవరపు రవి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.